క్లుప్తంగా

నేడు బల్లేరుగూడ రహదారి ప్రారంభం

జియ్యమ్మవలస: మండలంలోని బల్లేరు–బల్లేరుగూడ రహదారులకు గురువారం కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రారంభించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

సాంకేతిక సహాయకురాలి నియామకం

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకానికి సంబంధించి స్థానిక మండల కార్యాలయానికి సాంకేతిక సహాయకురాలు కె.శ్రీవిద్యను నియమిస్తూ డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్.పద్మావతిని సీతానగరం మండలానికి బదిలీ చేశారు. పార్వతీపురం మండలంలో పని చేస్తున్న శ్రీవిద్యను మండలానికి కేటాయించి భర్తీ చేసినట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అవగాహన తప్పనిసరి



పెట్రోల్ బంకు వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి పి. పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురష్కరించుకుని పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం, వేడి ఈ మూడింటిలో ఒక దానిని అదుపుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చునన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, తదితర ప్రమాదాలను ఏ విధంగా నివారించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు రేపు

పార్వతీపురం టౌన్: వినియోగదారుల హక్కులు, బీఎస్ఎన్ఎల్ సేవలపై శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఆడమ్ గొల్లమూడి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పాల్గొనే వారు htt pr://-ÆŠæn$-bèle-t.-g-o-of e.c-o-m/z-v-e& yxxm& ye u గూగుల్ మీట్ లింక్‌లో చేరాలని సూచించారు.

ఆధ్యాత్మిక భావనతో ఉండాలి

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో మెలగాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కొత్తవలస ప్రాంత పరిధిలో గల నవ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో దక్షిణ గాలిగోపురం ప్రారంభంతో పాటు ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జిల్లా జనరల్ సెక్రటరీ వెంపలి గురురాజు, సీనియర్ నాయకులు ఎజ్జవరపు పోలినాయుడు, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేయించుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పార్వతీపురం టౌన్: రక్తపోటు ఉన్న వారు విధిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని ఆప్తాలమిస్ట్ నగేష్‌రెడ్డి అన్నారు. అడ్డాపుశీల సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేపట్టి మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యసహాయకులు ఉమామాహేశ్వరి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: మండలంలోని కాశీపట్నం కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.నాగదుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, బడి బయట పిల్లలు, చదువు మధ్యలో వదిలేసిన చిన్నారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 12వ నుంచి వచ్చే నెల11లోగా ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

• మండల సమావేశంలో సభ్యులు

సీతంపేట: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక యువ శిక్షణా కేంద్రంలో ఎంపీపీ ఆదినారాయణ అధ్యక్షతన మండల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలు ప్రస్తావించారు. వీటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎంపీపీ బదులిచ్చారు. కొండ శిఖర గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రతీ ఏటా ఉంటుందని శాశ్వతంగా మంచినీటి సదుపాయం కల్పించడానికి ప్రణాళికలు రూపొందించాలని దోనుబాయి సర్పంచ్ వెంకునాయుడు, దారపాడు సర్పంచ్ సుందరమ్మ తదితరులు తెలిపారు. ఎక్కడెక్కడ నీటి కొరత ఉందనేది సర్వే చేయించి బోర్లు మరమ్మతులతో పాటు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మానాపురం, దోనుబాయి, కిల్లాడలలో సిగ్నల్ సమస్య వలన రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదన్నారు. ఆఫ్‌లైన్‌లో సరఫరా చేయాలని సర్పంచ్‌లు కోరారు. రెవెన్యూ అధికారులతో చర్చిస్తామన్నారు. ప్రిజమ్–10 గుర్చి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.గీతాంజలి తెలిపారు. మాతాశిశు మరణాలు నివారణకు గిరిజనులను చైతన్యం చేయాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలు, రక్తహీనత వలన వచ్చే నష్టాలు వివరించాలన్నారు. ఆయిల్ ఇంజిన్‌లు సబ్సిడీపై సరఫరా చేయించాలని సర్పంచ్‌లు కోరారు. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదని దారపాడు సర్పంచ్ సుందరమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సత్యం, పీఆర్ జేఈ కిరణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: ఇటీవల అనారోగ్యంతో గుమడ సర్పంచ్ దేవుపల్లి కళావతి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి వారి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలి

• ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర



మాట్లాడుతున్న డీడీ అన్నదొర

సీతంపేట: గిరిజన విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ట్రైబుల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర అన్నారు. స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన వార్షిక డే సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ టెన్త్‌క్లాస్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. సబ్జెక్టు పరంగా ఎటువంటి సమస్యలున్నా సంబంధిత ఉపాధ్యాయులతో చెప్పించుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన తర్వాత ఇంటర్మీడియెట్ ఆపై ఉన్నత చదువులు చదవడానికి పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వివిధ కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావాలన్నారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్, సైన్స్ ప్రాజెక్టు, టీఎల్ఎం ల్యాబ్స్, గార్డెన్ క్రమశిక్షణతో విద్యార్థినులు ఉన్నారని డీడీ అభినందించారు. డిప్యూటీఈఓ ఎ.లిల్లీరాణి మాట్లాడుతూ 40 మంది పిల్లలతో ప్రారంభమైన పాఠశాలలో నేడు 640 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. నాడు–నేడు పనులతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయన్నారు. దీంతో విద్యార్థులంతా సీట్లు కావాలని వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆనందరావు, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వలసబల్లేరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

కురుపాం: ప్రజలతో మమేకం కావడమే కమ్యూనిటీ పోలీసింగ్ లక్ష్యమని డీఎస్పీ కృష్ణారావు అన్నారు. మండలంలోని వలసబల్లేరు గిరిజన గ్రామంలో నీలకంఠాపురం పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని, 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నిరుపేద గిరిజన వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు, దోమ తెరలు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలిన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు, కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు, గుమ్మలక్ష్మీపురం ఎస్ఐ శివప్రసాద్, వైద్య సిబ్బంది బి.ప్రజ్ఞ, సాయిప్రసాద్, సుకృత, సంధ్య, అభినవ్, అమర సింహారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మూగజీవాల వ్యాధులపై తస్మాత్...




పశువులకు వైద్య సేవలను అందిస్తున్న ఏడీ గణపతిరావు

గరుగుబిల్లి: మూగజీవాల వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని గరుగుబిల్లి ఏరియా ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ బి.గణపతిరావు అన్నారు. డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మన గ్రామం – మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో మండలంలోని సంతోషపురం గ్రామంలో బుధవారం పశు వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో వున్న పశువులకు చికిత్సలు చేశారు. లేగదూడలకు ఏలికపాముల నివారణ మందులను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పులకు పశువులకు వ్యాధులు సోకే అవకాశం వుందన్నారు. పశువులకు అనారోగ్య లక్షణాలు వస్తే తక్షణం వైద్యశాలలో తనిఖీలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.శ్రీరాములునాయుడు, గ్రామ సర్పంచ్ ఎ.తవిటినాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.హరి రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు



పాలకొండ రూరల్: కవాతులో పాల్గొన్న సాయుధ బలగాలు, సీఐ, ఎస్ఐ



కురుపాం: గుమ్మ గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పాలకొండ రూరల్: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ పోలీసులు గట్టి బందోబస్తుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు పట్టణం, గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో సాయుధ బలగాలు బుధవారం పాలకొండ పట్టణంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయి.

గుమ్మలో కేంద్ర బలగాల కవాతు

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామంలో ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవాతులో సీఆర్‌పీఎఫ్ సీఐ ఐఎస్ఎన్ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన



పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన ర్యాలీ

కురుపాం: మండల కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం 3లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఏఎన్ఎం డి.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజ, ఎస్.వసంతరాణి తదితరులు అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహారం ఆవశ్యకత, కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు. .

పట్టుబడిన సారా

పాలకొండ రూరల్: పట్టణంలోని రెల్లివీధికి చెందిన అల్లాడ పకీరు 20 సారా ప్యాకెట్లు తరలిస్తూ బుధవారం పట్టుబడినట్టు ఎస్ఐ ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. తమ తనిఖీల్లో పకీరు పట్టుబడినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

సాలూరు: బాధిత కుటుంబాలు అధైర్యపడొద్దని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుదని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. నియోజకవర్గంలోని పాచిపెంట మండలానికి చెందిన షేక్ అలిసా, సంక్రోతు గణేష్ కుటుంబాలకు రూ.లక్ష, వంతల దొంబయ్య కుటుంబానికి రూ.2లక్షలు మొత్తం రూ.4 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టమొచ్చినా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



మాట్లాడుతున్న డీడీ రాజశేఖర్‌రెడ్డి

పాచిపెంట: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని భూగర్భ నీటి శాఖ డీడీ, ప్రత్యేకాధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటు ఆవశ్యకత, ఓటు హక్కును అందరు వినియోగించుకోవాలని, పోలింగ్ శాతం పెంచడం తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీఓ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మావుడి సోదరులు

మక్కువ: అడారుగెడ్డపై బ్రిడ్జి నిర్మాణ పనులకు జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బ్రిడ్జి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గిరిశిఖర గ్రామాలకు చెందిన ప్రజలు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి రూ.1.50లక్షలు మంజూరు చేసింది. దీంతో ఈ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పక్కాగా ‘భోజనం’ మెనూ



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్‌పీఎల్‌టీ కోఆర్డినేటర్ నాగరాజు

కొమరాడ: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌పీఎల్‌టీ కోఆర్డినేటర్ సీహెచ్ నాగరాజు అన్నారు. మండలంలోని గిరిజన సంక్షేమ పాఠశాల (గురుకులం) బాలికలు, బాలురు సంక్షేమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్ విధానం అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంఓ బోను శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

• ఎమ్మెల్యే కళావతి

భామిని: గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనే ప్రభుత్వ ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని మూలగూడకు సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాలను కలుపుతూ లింక్ రోడ్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత టీడీపీ పాలనలో గిరిజన గ్రామాలన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలుస్తున్న జగనన్నను ఎదుర్కోలేక మూడు పార్టీలు ముసుగు వేసుకొని వస్తున్నారని ఆరోపించారు. వారి మాయ మాటలు నమ్మవద్దన్నారు. ముందుగా గిరిజన మహిళలు ఎమ్మెల్యేకు గిరిజన సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, సొసైటీ చైర్మెన్ జి.రమేష్, డైరెక్టర్ కృష్ణారావు, కార్యదర్శి కె.చంటి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీలతో బహుళ ప్రయోజనం



అర్ధలి డిజిటల్ లైబ్రరీలో డీఎస్సీ మెటీరియల్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వ కొలువులు సాధించాలనే కోరిక విద్యార్థుల్లో ఉంటుందని ఈ క్రమంలో వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం సచివాలయాలకు అనుసంధానంగా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. అభిలాష కార్యక్రమంలో భాగంగా మండలంలో 15 సచివాలయాలకు ప్రభుత్వం సమకూర్చిన డీఎస్సీ, టెట్ మెటీరియల్ పుస్తకాలను బుధవారం ఆయన అందించారు. ఈ క్రమంలో అర్ధలి డిజిటల్ లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలతో పాటు ప్రభుత్వం ద్వారా అందించిన డీఎస్సీ మెటీరియల్‌ను పరిశీలించారు. యువత వాటిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈయన వెంట ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

15 నుంచి పంచవర్ణేశ్వర స్వామి ఉత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి – బొద్దిడి జంక్షన్ వద్ద గల పంచవర్ణేశ్వర స్వామి ఆలయం వద్ద పంచమ రాత్రి జాతర మహోత్సవాలు ఏజెన్సీ కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు పంచవర్ణేశ్వరునికి పూజలు, రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

‘క్రాష్’తో తాగునీటి ఎద్దడి నివారణ

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్యలు అధిగమించేలా అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ‘క్రాష్’ కార్యక్రమ వినియోగానికి సంబంధించి సచివాలయాల సిబ్బందికి పలు సూచనలు బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హెచ్.ప్రవళిక తదితరులు మాట్లాడుతూ మండలంలో 32 పంచాయతీల ద్వారా 22 సచివాలయాల పరిధిలో 308 చేతి బోర్లు ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం అన్ని బోర్లు వినియోగంలో ఉన్నాయన్నారు. వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఈ బోర్లును దశల వారీగా తాజా స్థితిగతులు పరిశీలించి, అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టేలా క్రాష్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక వాహనంలో సంబంధిత సిబ్బంది పంచాయతీల్లో పర్యటించనున్నట్లు వివరించారు.

నేడు కిమ్మి – రుషింగి వంతెన ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన కిమ్మి – రుషింగి వంతెన

వీరఘట్టం: మండలంలోని కిమ్మి – రుషింగి గ్రామాల మధ్య రూ.27.5 కోట్ల వ్యయంతో నాగావళి నదిపై నిర్మించిన వంతెనను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ గురువారం ప్రారంభించనున్నారు. అలాగే కిమ్మిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను కూడా ప్రారంభిస్తారు. అనంతరం కిమ్మి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బొత్స సత్యనారాయణ పాల్గొంటారు.

భూ హక్కు పత్రాల అందజేత



అర్ధలిలో జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ

పాలకొండ: జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకంతో భావితరాలకు వివాద రహిత భూమిని అందిస్తున్నామని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అర్ధలి గ్రామంలో బుధవారం జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకంలో భాగంగా లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందజేశారు. ఈ పంచాయతీలో 518 మందికి హక్కు పత్రాలు వచ్చాయని వీటిలో 283 మందికి హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు



ఉల్లిబద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు

గరుగుబిల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని ఉల్లిబద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు అన్నారు. ఉల్లిబద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌ను బంగారు బాటగా తీర్చిదిద్దుకొనేందుకు విద్యార్థులు క్రమశిక్షణతో, ప్రణాళికతో విద్యనభ్యసించాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.